రిజిస్ట్రేషన్లు ప్రారంభం

రామంతాపూర్: కొన్ని సంవత్సరాలుగా ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామంతాపూర్ శ్రీనగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన అద్దె భవనంలోకి తరలించారు. కార్యాలయంలో మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉప్పల్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామంతాపూర్‌కు తరలించినట్లు తెలిపారు.


స్థలం.. నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే..

కొత్తగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి ఉప్పల్ భగాయత్ సమీపంలో 500 గజాల స్థలం, రూ.50 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఉప్పల్ భగాయత్ సమీపంలో కేటాయించిన సొంత స్థలంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


రామంతాపూర్‌లో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వారి స్టైలే.. వేరు

- పదేళ్లలో మేడ్చల్‌పై పట్టుసాధించిన మర్రి, మల్లారెడ్డి
- రాజకీయంగా నిలదొక్కుకున్న మామా అల్లుళ్లు
- వ్యాపారవేత్తలుగా ఎదిగి.. రాజకీయంలోనూ రాణిస్తూ..
- రాజకీయం నుంచి దూరం కాకుండా అల్లుడికి మామ సపోర్ట్


మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి


మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్: తమ వ్యాపారాలతో మేడ్చల్ జిల్లాకు ప్రవేశించిన మామా అల్లుళ్లు పదేళ్ల క్రితం రాజకీయరంగ ప్రవేశం చేసి ప్రతికూల పరిస్థితుల్లో ఎమ్మెల్యేలుగా గెలిచి మేడ్చల్‌పై పట్టు సాధించారు. మేడ్చల్ మండలం మైసమ్మగూడ, కండ్లకోయ, శివార్లలోని బోయిన్‌పల్లి, సూరారంలో మల్లారెడ్డి విద్యాసంస్థలు, మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు, ఫంక్షన్‌హాళ్లు, వివిధ రకాల వ్యాపారాలు చేసి పదేళ్ల క్రితం వరకు వ్యాపారవేత్తగా పేరుగాంచారు. ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మేడ్చల్ పక్కనే ఉన్న దుండిగల్ మండలంలో ఇంజినీరింగ్ కళాశాలలు, మెడికల్ కళాశాల, వివిధ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి మామ చాటు వ్యాపారవేత్తగా ఎదిగారు.

- 2014లో మల్లారెడ్డి అనూహ్యంగా టీడీపీలో చేరి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలిచారు. కేవలం వ్యాపారవేత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మల్లారెడ్డి పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో మేడ్చల్ బీఆర్‌ఎస్ టికెట్ సాధించి అసెంబ్లీకి ఎన్నికై తన బలంతో మంత్రి అయ్యారు. అదే సమయంలో తన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇప్పించి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో అల్లుడు ఓడిపోయినా జిల్లాలో మిగతా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సహకరించకపోయినా అల్లుడిని తన వెంట బెట్టుకుని మేడ్చల్ కేంద్రంగా రాజకీయం నడిపాడు. తాను మంత్రిగా ఉంటూ అల్లుడికి లోకల్ రాజకీయాలు అప్పగించి రాజకీయం నుంచి దూరం కాకుండా మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పదవి ఇప్పించి ఫైల్‌టైం రాజకీయ నాయకుడిని చేశారు.

తన మార్కు ఉండేలా

2018 వరకు మామ చాటు అల్లుడిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఆ తర్వాత జిల్లాలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ మార్కు ఉండేలా తమకు మద్దతు ఇచ్చిన వారికి మేయర్లు, చైర్మన్‌లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పదవులు ఇచ్చుకుని వారిని తమ అనుచరులుగా మార్చుకున్నారు. తన మార్క్ రాజకీయం చేస్తూనే మామకు బంటుగా ఉండిపోయారు. మామ మంత్రిగా ఉన్నా అధికారం పూర్తిగా అల్లుడు తీసుకుని కావాల్సిన పనులన్నీ చేశారు. మొత్తం మీద మేడ్చల్ రాజకీయంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నా తమదే ఆధిపత్యం అని మామా అల్లుళ్లు మరోసారి నిరూపించుకున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ..

- రాజకీయంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని మల్లారెడ్డి, ఆయన కుటుంబం ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటూ రాజకీయ జీవితంలో సక్సెస్ అయ్యారు. అల్లుడు పార్లమెంట్ ఇన్‌చార్జిగా, పెద్ద కుమారుడు మహేందర్‌రెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా ఉంటూ రాజకీయం తన కుటుంబం దాటకుండా చూసుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఖరారైనా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి వ్యవహారంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. ఆచితూచి అడుగులేసిన మల్లారెడ్డి చాకచక్యంగా తన అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరి బీఆర్‌ఎస్ టికెట్ సాధించాడు. ఒకవైపు మేడ్చల్‌లో తాను పోటీచేస్తూ మరోవైపు మల్కాజిగిరిలో అల్లుడిని పోటీలోకి దింపి ఇద్దరు ఎమ్మెల్యేలు కావడంతో ఐదు నియోజకవర్గాల్లో రెండింటిలో మామా అల్లుళ్లు గెలిచి జిల్లాపై పూర్తి పట్టుసాధించారు.
- ఇద్దరు వ్యాపారులు కావడం, ఆర్థిక వనరులకు ఇబ్బంది లేకపోవడం, మంచి పేరు ఉండటం, ఇద్దరికీ కేసీఆర్, కేటీఆర్ దగ్గర నుంచి కార్యకర్త వరకు పూర్తిగా పలుకుబడి ఉండటం, ప్రధానంగా నాయకుల బలం, విద్యార్థుల బలం, మానవవనరులు పుష్కలంగా ఉండటంతో అన్నీ సద్వినియోగం చేసుకుని మేడ్చల్ జిల్లాలో మామా అల్లుళ్లు వ్యాపారం నుంచి మొదలై రాజకీయాన్ని శాసించే స్థాయికి ఎదిగి ఏ రంగంలోనైనా తమకు ఎదురులేదని నిరూపించుకున్నారు. జిల్లాలో ఉద్దండ రాజకీయ నాయకులు, ఏళ్లుగా రాజకీయం చేస్తున్నా మామా అల్లుళ్లు మాత్రం వారిని మట్టి కరిపించి తమకు తిరుగులేదని అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపించుకున్నారు.

అన్ని బాధలకు వైద్య రంగంలో ఎన్నో మార్గాలు


మాట్లాడుతున్న వైద్యులు శ్రీనివాస్ బలగాని

మేడ్చల్: తరచూ వచ్చే నడుము, మెడనొప్పులపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దని డాక్టర్ శ్రీనివాస్ బలగాని అన్నారు. గుండ్లపోచంపల్లిలోని బలగాని స్పైన్ ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ చాలామంది మెడ, నడుము నొప్పులతో బాధపడుతూ చికిత్సలు చేసుకోవడం లేదని, ఇలాంటి నొప్పులకు వైద్య రంగంలో ఎన్నో మార్గాలు ఉన్నాయని అన్నారు. ఆపరేషన్లు చేసుకుంటే ఇతర సమస్యలు వస్తాయని అపోహ పడుతున్నారని అన్నారు. అలాంటి అపోహలకు తావివ్వకుండా ఆపరేషన్లు చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. ఇప్పటివరకు 300 ఆపరేషన్లు చేశామని వివరించారు.

ఎన్‌ఆర్‌సీఈలో విద్యార్థి సంఘం ఏర్పాటు


స్టూడెంట్ యాక్షన్ కమిటీ సభ్యులతో అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్షన్ కమిటీ(సాక్) పేరిట విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీని కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి చేతులమీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి సంఘాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఉంటాయని, ఇలాంటి బృందాలతో విద్యార్థుల్లో ఐక్యత ఏర్పడుతుందని, తద్వారా విద్యార్థులు ఐక్యంగా ఏదైనా సాధించగలరని తెలిపారు. ప్రిన్సిపల్ లోక్‌నాథం మాట్లాడుతూ.. సాంకేతకంగా సమాజంలో వచ్చే మార్పులను అందిపుచ్చుకొని, అందుకు తగిన వర్క్‌షాప్, విద్యార్థి అభివృద్ధి తదితర కార్యక్రమాల కల్పనే ఈ బృందం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కరెస్పాండెంట్ సంగీతరెడ్డి, కళాశాల డైరెక్టర్ మోహన్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. సాక్ అధ్యక్షుడిగా షేక్ జాఫీర్, ఉపాధ్యక్షుడిగా షైన్వాజ్ హుసేన్, క్యాదర్శిగా నవీన్‌కుమార్, కోశాధికారిగా దివ్యశ్రీ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి శ్రీరామలింగేశ్వరుడి ఆశీర్వచనం


ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి కీసరగుట్ట స్వామివారి ఆశీర్వచనం అందజేస్తూ..

కీసర: మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డికి మంగళవారం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ వేదపండితులు స్వామివారి ఆశీర్వచనం అందజేశారు. ఈ మేరకు మంగళవారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నివాసానికి కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ట్రస్టు బోర్డు సభ్యులతో కలిసి వెళ్లిన వేదపండితులు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో పాటు మేడ్చల్ నియోజకవర్గం ప్రజల అండదండలతో తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. ట్రస్టు బోర్డు సభ్యులు, నేతలు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, బెలిదే రమేష్‌గుప్తా, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వెంటనే స్పందించండి

మల్కాజిగిరి: సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు స్పందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు డీసీ జి.రాజు, ఈఈ లక్ష్మణ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయానికి ప్రజలు వస్తుంటారని, వారి పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించకుండా స్పందించి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలన్నారు.

నర్సాపూర్ ఎమ్మెల్యేను కలిసిన మేడ్చల్ నాయకులు



మేడ్చల్: సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. సునీతారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో అత్వెల్లికి చెందిన నాయకులు నవాజ్‌రెడ్డి ఇతరులు ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలందరికీ ధన్యవాదాలు


ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: సైనిక్‌పురిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్యకర్తలతో వర్చువల్‌గా సమావేశం అయ్యారు. టికెట్ ప్రకటించినప్పటి నుంచి కార్యకర్తలంతా తన వెన్నంటే ఉంటూ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన విజయానికి కృషి చేసిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని ముందుకెళ్తూ ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

జక్కా వెంకట్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో కేటీఆర్, మల్లారెడ్డి


జక్కా వెంకట్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో కేటీఆర్, మల్లారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ నగరమేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. మంగళవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న వేడుకల్లో కేటీఆర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బర్త్‌డే వేడుకలకు హాజరై మేయర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్, మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఆనందంగా జరుపుకునే పుట్టిన రోజు, పెళ్లిరోజు వేడుకల్లో వృథా ఖర్చులు, ఆర్భాటాలకు పోకుండా మొక్కలు నాటడం, అనాథలను ఆదుకోవడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు సూచించారు. మేయర్ పుట్టిన రోజు సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి


హెచ్‌బీకాలనీలో పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: విధుల్లో భాగంగా స్వచ్ఛత కోసం పాటుపడుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను అందజేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌ఆర్ మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలను గుర్తు చేస్తూ వారిని అభినందించారు. నిత్యం చెత్తాచెదారంతో సావాసం చేసే కార్మికులు వారి ఆరోగ్య రక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కిట్స్ వారికి ఎంతగానో దోహదపడతాయన్నారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బోదాసు రవి, నవీన్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను మంగళవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలు, చెత్తాచెదారం పేరుకుపోయినా పరిసరాలను క్లీన్ చేయడంలో విశేష కృషి చేస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య సంరక్షణకు రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జవాన్ కృష్ణ, ఎస్‌ఎఫ్ఏలు యాకస్వామి, శ్యామల, రాజేష్, నరేష్, బీఆర్‌ఎస్ నేతలు విఠల్ యాదవ్, బుచ్చిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న కురుమ సంఘం ప్రతినిధులు

ఉప్పల్: ఆలేరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన బీర్ల ఐలయ్య కురుమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరుతూ ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రతినిధులు కోరారు. రాజకీయంగా వెనుకబడి ఉన్న కురుమల్లో బీర్ల ఐలయ్య విజయం సాధించారని, రాష్ట్రంలో ఉన్న 50 లక్షల కురుమలకు ప్రతినిధిగా ఉన్న బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగే మల్లేష్, ఉపాధ్యక్షుడు గొరిగే రమేష్, రేవు కృష్ణయ్య, గొరిగే పెద్ద మల్లేష్, బెల్లం గట్టయ్య, చౌదరిపల్లి పర్వతాలు, చిందం వెంకటేష్, గొరిగే మల్లేష్, జన్ని రఘు తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకొని వెళ్లాల్సిందేనా..?


రాధిక చౌరస్తా సమీపంలో నిలిచిన మురుగు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ రాధిక చౌరస్తా సమీపంలో మురుగు నీరు నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. రహదారి వెంబడి నడిచే పాదచారులు, ప్రయాణించే వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మానసిక వికలాంగులకు మనోధైర్యం కల్పించాలి


పీర్జాదిగూడలో చైల్డ్ గైడెన్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో తుంగతుర్తి రవి

మేడిపల్లి: మానసిక వికలాంగులకు మనోధైర్యం కల్పిస్తూ వారికి పునరావాసం కల్పించడంలో చైల్డ్ గైడెన్స్ సెంటర్ చేస్తున్న సేవలు అభినందనీయం అని కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన చైల్డ్ గైడెన్స్ సెంటర్‌కు ముఖ్యఅతిథిగా పాల్గొని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల్లోని మారుమూల పల్లెల్లో, గిరిజన ప్రాంతాలకు చెందిన మానసిక వికలాంగులైన చిన్న పిల్లల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ఐదు దశాబ్దాలుగా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న చైల్డ్ గైడెన్స్ సెంటర్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో చైల్డ్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ రజని, ప్రధాన కార్యదర్శి జైనీ రోస్ కుమారి, షీలా, లక్ష్మీ, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లారెడ్డికి అభినందనల వెల్లువ


మల్లారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, నాయకులు


ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, నాయకులు

మేడ్చల్: మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి విజయం సాధించడంతో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆయనను కలిసి అభినందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరాజు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన గుండ్లపోచంపల్లి నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నాయకులు మంగళవారం కలిశారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షులు శ్రీహరి, దయాకర్‌ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్ నుంచి..

ఘట్‌కేసర్: మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాజశేఖర్ రెడ్డిని నగరంలోని వారి నివాసంలో ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ మైనారిటీ అధ్యక్షుడు కుతుబ్, పవన్, అస్లాం, జహంగీర్, ఫయామ్, శశబేగం, యూసుఫ్, విజయ్‌ముదిరాజ్, శంకర్, లక్ష్మణ్, ఆంజనేయులు, నర్సింహ, పద్మ, లక్ష్మీ, సుజాత, జావెద్, సమీర్ పాల్గొన్నారు.

శాలువాతో సత్కరించి..

ఎమ్మెల్యే మల్లారెడ్డిని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. రైతుబంధు జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, బీఆర్‌ఎస్ స్థానిక శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, మాజీ సర్పంచ్ రమేశ్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన మేడ్చల్ నాయకులు


ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన గుండ్లపోచంపల్లి నాయకులు


మల్లారెడ్డికి అభినందనలు తెలుపుతున్న కొండల్‌రెడ్డి, ఐలయ్యయాదవ్

కార్యకర్తలకు అండగా ఉంటా..

మల్కాజిగిరి: నేను ఓడినా.. మెదక్‌లో నా కొడుకు రోహిత్‌ను గెలిపించుకొని చాలెంజ్‌ను గెలిచానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తాను డబ్బులు ఖర్చు పెట్టలేదని, రూ.250 కోట్లు ఖర్చు చేసి వారు గెలిచారన్నారు. ప్రజల మద్దతు ఉండటంతో సుమారు 75 వేలకుపైగా ఓట్లు వచ్చాయన్నారు. డబ్బుతో రాజకీయం చేసిన కేసీఆర్‌ను ఇంటికి పంపించామన్నారు. పేదవారు కూడా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒక ఉద్యమంగా మల్కాజిగిరిలో ప్రారంభించి ఢిల్లీ వరకు తీసుకెళ్తానన్నారు. ఓట్ల లెక్కింపు రోజు మధ్యాహ్నమే ఫలితం తెలిసిందని, కార్యకర్తలకు మనోధైర్యం కల్పించడానికే కౌంటింగ్ కేంద్రానికి వెళ్లానన్నారు.


- గ్రేటర్‌లో బీఆర్‌ఎస్ గెలవడానికి ఎన్నికలకు కొన్ని రోజుల ముందు రియల్ ఎస్టేట్ వ్యాపారులను, ఐటీ కంపెనీ ఉద్యోగులను బీఆర్‌ఎస్ రాకపోతే నష్టపోతారని బెదిరించారని, అందుకే ఆ మాత్రం సీట్లు వచ్చాయన్నారు. రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న డివిజన్ల సంఖ్య పెరుగుతుందని, అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటాని, అలా జరగకపోతే రాజకీయాల్లో నుంచి తప్పుకుంటానన్నారు.
- రాజకీయాల్లో నుంచి తప్పుకున్నా ప్రజాసేవ కొనసాగిస్తానని మంచి నాయకులను తయారు చేస్తానన్నారు. ప్రతి అభ్యర్థి ఒక్క రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటానన్నారు. నాతో పాటు ఉండే క్యాడర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌తో కలిసి పనిచేస్తామని, పార్టీని బలోపేతం చేస్తామన్నారు. వారిని ఊపిరి ఉన్నంత వరకు కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, జీఎస్వీ సతీష్‌కుమార్, గుండా నిరంజన్, వెంకటేష్‌యాదవ్, సానాది శంకర్, ఉమేష్‌సింగ్, వినోద్ యాదవ్, పిట్ల శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం


టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మందుముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం హోటల్ ఎల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని తీన్మార్ మల్లన్నతో పాటు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, వాటిని అధిగమించి ముందుకు సాగాలని, రాబోయే కాలంలో ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ధైర్యం చెప్పారని పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


బాలల పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ..

అల్వాల్: బాలల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. మచ్చ బొల్లారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు అవహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాట్లాడుతూ బాలలే తమ హక్కులను తాము సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, బాలికలను చదివిస్తే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. బాలికలకు బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలు, పోక్సో చట్టం, చైల్డ్ లైన్, సఖీ సెంటర్, హెల్ప్‌లైన్ నంబర్ 100, 181, 1098, 14567 నంబర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.